యువతకు అండగా ఉంటా..

- వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- యువతీ, యువకులతో ఆత్మీయ సమావేశం


నక్కవానిపాలెంలో యువతులతో కె.కె.రాజు

సీతమ్మధార: యువతతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు భరోసా ఇచ్చారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో యువజన విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా యువజన విభాగం నాయకులు, యువకులతో కలిసి పార్టీ జెండా భుజాన వేసుకొని బాలయ్యశాస్త్రి లేఅవుట్ ప్రాంతంలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతకు అందించిన పోత్సాహాన్ని గుర్తుచేశారు. తాను ఉత్తర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత యువతకు మంచి భవిష్యత్తు కోసం కృషి చేస్తానన్నారు. పేదరిక నిర్మూలన, కులమతాల వివక్షను పారదోలడం, ప్రతి ఒక్కరిలో సమానత్వాన్ని గుర్తించే ఒకే ఒక అస్త్రం విద్య అనే నమ్మకంతో విద్య వ్యవస్థలో సంచలనాత్మకమైన నిర్ణయాలను సీఎం తీసుకున్నారని చెప్పారు. జగనన్న అధికారం చేపట్టిన నాడే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఆ దిశగా విశాఖలో పరిశ్రమల స్థాపనకు తీవ్రస్థాయిలో కృషి చేశారని తెలిపారు. 2024లో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తే యువతకు అధిక ప్రాధాన్యం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, కె.వి.ఎన్.శశికళ, పార్టీ వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, వైస్ ప్రెసిడెంట్ సునీల్‌కుమార్, అంబటి శైలేష్, మువ్వల సంతోష్, బాణాల తరుణ్, వెంకటేష్, యువకులు పాల్గొన్నారు.


బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో యువత, నాయకులతో కలిసి పాదయాత్ర చేస్తున్న కె.కె.రాజు

యువతకు సూచనలు

జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం బీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం యువతీ, యువకులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యువతకు వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పలు సూచనలిచ్చారు. యువతకు తాను అండగా నిలుస్తానన్నారు. కార్యక్రమంలో 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, పార్టీ మండల ఇన్‌చార్జి జి.వి.రమణి, మురళీకృష్ణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కోలాహలం

ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా కె.కె.రాజు పేరును ప్రకటించిన సందర్భంగా ఆదివారం కార్పొరేటర్లు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, సీనియర్ నాయకులు, మహిళలు, పలు సంఘాల నాయకులు ఆయనను ఘనంగా గజమాలతో సత్కరించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయం వద్దకు వారంతా భారీగా చేరుకోవడంతో కోలాహలం నెలకొంది. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కె.కె.రాజును అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని, ఉత్తర ఎమ్మెల్యే కె.కె.రాజు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, మాజీ కార్పొరేటర్లు మువ్వల పోలారావు, వార్డు అధ్యక్షులు పైడి రమణ, అమర్‌రెడ్డి, శ్రీ భక్త మార్కండేయ సేవా సంఘం సభ్యులు, నంబాల రాజేష్‌కుమార్, బొట్టా రాజు, ఆదిలక్ష్మి, అంబటి శైలేష్, యువతీ, యువకులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

రజకులకు అన్ని విధాలా భరోసా

మద్దిపాలెం: రజకులకు అన్ని విధాలా అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు భరోసా ఇచ్చారు. 51వ వార్డు అప్పయ్యనగర్ దోబీఘాట్ వద్ద శ్రీవెంకటేశ్వర రజక సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బల్లల పండగ వేడుకలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందేలా చేశారని తెలిపారు. ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యం, ఉపాధి, గృహం వంటివి అందేలా చేసిన ఏకైక సీఎం ఆయనేనని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో అధిక మెజారిటీతో వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక రజక సంఘం ప్రతినిధులు కె.కె.రాజుకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. పార్టీ నాయకులు అంబటి శైలేష్, కృష్ణారావు మాస్టర్, అమర్ రెడ్డి, తిరుమలరావు, దమయంతి, శ్యామ్, రత్నం, వి.వరలక్ష్మి, అప్పారావు మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును సత్కరిస్తున్న రజక సేవా సంఘం సభ్యులు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఎటువంటి నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని వారికి సూచించారు. ఎన్నికల నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని, తగదాలు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీరు చేసే పనులపై ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీషీటర్లకు పోలీస్ సిబ్బంది సూచించారు.

- ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లు, పాత నేరస్తులకు సీఐ.విజయకుమార్ కౌన్సెలింగ్ చేశారు. ఎన్నికల వేళ జాగ్రత్తగా ఉండాలని, హద్దు మీరితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటరావు పాల్గొన్నారు.


రౌడీషీటర్ల వివరాలు అడిగితెలుసుకుంటున్న ఐదో పట్టణ సీఐ భాస్కరరావు

నేరాల జోలికి పోవద్దు

మద్దిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎస్.భాస్కరరావు మాట్లాడుతూ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎటువంటి అల్లర్లు సృష్టించకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. మద్యం షాపుల వద్ద గొవడలు చేయకూడదన్నారు. ఎల్లప్పుడూ పోలీస్ నిఘా ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా మెలగాలన్నారు. ఎస్‌ఐలు రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

‘మిసెస్ ఆంధ్రా, మిస్ ఆంధ్రా’ విన్నర్స్‌గా విశాఖ మహిళలు

మురళీనగర్: గ్లోబల్ ఇండియా ఎంటర్‌టైన్‌మెంట్ ప్రొడక్షన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఇటీవల నిర్వహించిన మిసెస్ ఇండియా, మిస్ ఇండియా పోటీల్లో విశాఖ మహిళలు తమ ప్రతిభ చాటారు. పట్టాభిరెడ్డితోటకు చెందిన గెద్దం నాగమణి ప్లాటినం కేటగిరీలో మొదటి స్థానంలో నిలిచి మిసెస్ ఆంధ్రా టైటిల్ గెలుచుకోగా.. మిస్ ఆంధ్రా టైటిల్‌ను పి.మానస లహరి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టాభిరెడ్డితోటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. దేశ వ్యాప్తంగా 300 మంది మహిళలు పోటీలో పాల్గొనగా.. మిసెస్ ఆంధ్ర, మిస్ ఆంధ్రా టైటిల్స్‌కు తమను ఎంపిక చేసినట్లు నాగమణి, మానసలహరి తెలిపారు. బాలీవుడ్ హీరోయిన్ శిల్పాశెట్టి న్యాయనిర్ణేతగా వ్యవహరించినట్లు చెప్పారు. ఈ పోటీల్లో విజయానికి సహకరించిన అందరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.


మిసెస్ ఆంధ్రా నాగమణి, మిస్ ఆంధ్రా మానస లహరి

క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన కె.కె.రాజు


రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన సందర్భంగా ఆదివారం విశాఖ విమానాశ్రయంలో రాజ్యసభ సభ్యుడు, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని కె.కె.రాజు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, పార్టీ ప్రధాన కార్యదర్శి జి.రవిరెడ్డి, కాశీవిశ్వనాథ్, దామా సుబ్బారావు, ఆళ్ల శివగణేష్, అంబటి శైలేష్, కిరణ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ లాజరస్ సంస్మరణ సభ


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్మూర్తి

కంచరపాలెం: మనువాద హిందూ ఫాసిస్ట్ శక్తులను ఓడించడానికి లౌకిక వామపక్ష శక్తులు ఏకం కావాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీరామ్మూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఐటీఐ కూడలి కాయిత పైడయ్య కల్యాణమండపంలో భారత నాస్తిక సమాజం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సీఐటీయూ నాయకుడు కామ్రేడ్ సీహెచ్ ఎఫ్ లాజరస్ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. సమానత్వాన్ని, సామాజిక న్యాయాన్ని కాపాడుకోవాలంటే భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలసిన బాధ్యత అందరిపై ఉందనన్నారు. లాజరస్ కృషిని ఆయన కొనియాడారు. సమాజం జిల్లా అధ్యక్షుడు వై నూకరాజు, డాక్టర్ జయగోపాల్, బి.సత్యానందరావు, రెడ్డిపల్లి బాబూరావు, పట్నాయక్, జె రవి, సునీత, అజయ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి


సినీ గీతాలు ఆలపిస్తున్న సింగర్స్

సీతంపేట: స్వర సాగర్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో రాధాకృష్ణ శీర్షికన మూడు గంటల పాటు నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను సంగీత సాగరంలో ముంచెత్తింది. గాయకుడు సింగ్ సంగీత దర్శకత్వంలో నగరానికి చెందిన గాయనీ గాయకులు కె.ఎల్.రావు, లోకేష్, రామ్‌కుమార్, పట్టెం వెంకటేష్, రాధారాణి, మంజుల, సుజాత, రంజిత, రేణుక, లావణ్య సినీ గీతాలు ఆలపించి శ్రోతలను అలరించారు.

బాలబాలికలకు పోషకాహారం పంపిణీ


పోషకాహారం అందిస్తున్న ప్రమీల తదితరులు

మురళీనగర్: మురళీనగర్‌లో బాక్సింగ్ సాధన చేస్తున్న చిన్నారుకు ఓం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రమీల ఆధ్వర్యంలో ఆదివారం పోషకాహారం పంపిణీ చేశారు. 65 మంది బాలబాలికలకు గుడ్లు, అరటిపండ్లు, మజ్జిగ, చాక్‌లెట్లు, బిస్కెట్లు అందించారు. కార్యక్రమంలో మురళీనగర్ రెసిడెన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్, వాకర్స్ డిస్ట్రిక్ట్-101 ఎలక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, బాక్సింగ్ కోచ్ చౌదరి, మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్, క్లబ్ ఉపాధ్యక్షులు పి.గిరిధర్, నాగేశ్వరరావు, కార్యదర్శి నిర్మల, సంయుక్త కార్యదర్శి పి.సతీష్ కుమార్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం బర్మాక్యాంప్ జైభారత్‌నగర్‌లో గ్రామాధ్యక్షుడు బొగ్గ శ్రీను ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు మాట్లాడుతూ తాను అట్టడుగు నుంచి వచ్చి వ్యక్తినేనన్నారు. వైఎస్సార్‌సీపీలో ఒక సాధారణ కార్యకర్తగా చేరిన తనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారని తెలిపారు. బొగ్గ శ్రీను మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, పార్టీ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కె.కె.రాజు

ఆలోచించి ఓటేయండి

తాటిచెట్లపాలెం: రాబోయే ఎన్నికల్లో ప్రజలు తమ అమూల్యమైన ఓటును ఆలోచించి వేయాలని ప్రజాశాంతి పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జె.రవికుమార్ అన్నారు. రైల్వే న్యూకాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, క్రిస్టియన్‌ల నమ్మకమైన నాయకుడు తమ పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అని తెలిపారు. ఆయనను విశాఖ నుంచి ఎంపీగా గెలిపించుకోవాలని కోరారు. జాతీయ కో ఆర్డినేటర్ బాబోజిరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కోసం పోరాడుతున్న ఏకైక వ్యక్తి కేఏ పాల్ అని అన్నారు. ఈ సందర్భంగా పాల్ రావాలి–పాలన మారాలి కరపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశాఖపట్నం పార్లమెంట్ ఇన్‌చార్జి రెడ్డి యేసుపాదం, గాజువాక నియోజకవర్గ ఇన్‌చార్జి మేకల శుభాకర్, ప్రసన్నకుమార్, రాజు, స్వాతి విక్టరీ, పాల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రికను ఆవిష్కరిస్తున్న పీఎస్పీ నాయకులు

చూడచక్కగా పార్క్

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్ చాకలిపేటలోని ఖాళీ స్థలంలో నూతన పార్కు నిర్మించారు. దోబీఖానా పక్కనున్న సుమారు 574 గజాల స్థలంలో స్థానికుల కోరిక మేరకు వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు చొరవతో పార్కును అభివృద్ధి చేశారు. రూ.16.30 లక్షలతో ఖాళీ స్థలం చుట్టూ ప్రహరీ, పార్కు లోపల వాకింగ్ ట్రాక్, సేద తీరడానికి సిమెంట్ బెంచీలు నిర్మించారు. ట్రాక్ చుట్టూ గ్రీనరీ, ట్రాక్ మధ్యలో పిల్లలు ఆడుకోవడానికి ఆట పరికరాలు ఏర్పాటు చేయనున్నారు. పిచ్చి మొక్కలతో ఉండే ఖాళీ స్థలాన్ని స్థానికులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దినందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


26వ వార్డులో నిర్మించిన పార్క్

ఎర్నిమాంబకు పూజలు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 దర్శనాలు కల్పించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ లండ రమణ, సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, జోజిబాబు, కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యాలు పర్యవేక్షించారు.


అమ్మవారి సన్నిధిలో వాసుపల్లి గణేష్‌కుమార్

మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు అభినందనలు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఆర్. మంజులను పలువురు అధ్యాపకులు అభినందించారు. కళాశాల అభివృద్ధికి, విద్యార్థులకు మంచి బోధన అందించేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా కొనసాగిన డాక్టర్ ఎస్. శోభారాణి రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఆమె స్థానంలో భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించిన మంజులను ఇక్కడ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.


ప్రిన్సిపాల్ మంజులను అభినందిస్తున్న అధ్యాపకులు

నేటి నుంచి యోగా తరగతులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రత్యేక యోగా థెరపీ తరగతులు నిర్వహించనున్నట్టు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 8 వరకు తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలన్నారు.

‘పది’ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ప్రారంభం
- పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి


ఆర్పీ పేట హైస్కూల్‌లో సిద్ధమైన తరగతి గది


టెన్త్ విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెబుతున్న జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: ఈ నెల 18వ తేదీ సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి ఫైనల్ పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. నియోజకవర్గంలోని పరీక్షి కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. టెన్త్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. కంచరపాలెం, ఐటీఐ కూడలి పరిధి రామ్మూర్తిపంతులుపేట, కప్పరాడ, భాష్యం, శ్రీచైతన్య, రామకృష్ణ తదితర ఉన్నత పాఠశాలల పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, డీవోలు తెలిపారు. తరగతి గదుల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. విద్యార్థులు నిబంధనలు, సమయపాలన పాటించాలని అధికారులు కోరారు. పరీక్ష సమయం కంటే అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

విద్యార్థులు రెడీ..

జ్ఞానాపురంలోని సేక్రెడ్‌హార్ట్ బాలికోన్నత పాఠశాల, జూబ్లీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల, ఐటీఐ కూడలిలోని కప్పరాడ ఉన్నత పాఠశాల, కరాసలోని స్టెల్లామేరీస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఎన్‌ఏడీ కొత్తరోడ్డులోని రామకృష్ణ పబ్లిక్ స్కూల్, ఎన్‌ఏడీ శ్రీచైతన్య స్కూల్, ఆర్పీ పేట జీవీఎంసీ ఉన్నత పాఠశాల, కప్పరాడ ఉన్నత పాఠశాలల నుంచి పరీక్షలు రాసేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని హెచ్‌ఎంలు ఆర్.శ్రీనివాసరావు, వి.విజయమాలిని తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు ఆల్ ది బెస్ట్

పదో తరగతి విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ సూచించారు. కంచరపాలెం గౌరీనగర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో టెన్త్ విద్యార్థులకు ఆయన ఆల్ ది బెస్ట్ చెప్పారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసి, మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తుకు మంచి పునాది పదో తరగతని చెప్పారు. టెన్త్ పరీక్షల్లో 10/10 మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే మంచి ప్రోత్సాహకాన్ని అందిస్తానన్నారు. అనంతరం టెన్త్ విద్యార్థుల పరీక్ష సామగ్రిని సతీష్ పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కాయిత పైడి రత్నాకర్ యాదవ్, నమ్మి జ్యోతేష్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలు రాయనున్న విద్యార్థుల వివరాలు

పరీక్షా కేంద్రం	విద్యార్థుల సంఖ్య
ఆర్పీ పేట ఉన్నత పాఠశాల	168 మంది
కప్పరాడ ఉన్నత పాఠశాల	170 మంది
జ్ఞానాపురం సేక్రెడ్‌హార్ట్ పాఠశాల	210 మంది
జూబ్లీ ఇంగ్లిష్ మీడియం స్కూల్	198 మంది


ఐటీఐ కూడలిలోని కప్పరాడ సెంటర్


కప్పరాడ పాఠశాలలో టేబుల్‌పై హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

144 సెక్షన్ అమలు

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు మాధవధార హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాటు చేసినట్టు హెచ్‌ఎం హేమలత తెలిపారు. 154 మంది టెన్త్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని చెప్పారు. ఫ్యాన్‌లు, లైట్లు వంటి సౌకర్యాలు స్కూల్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. పరీక్షా కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ విధిస్తున్నట్టు కంచరపాలెం ఐదో పట్టణ సీఐ ఎస్.భాస్కరరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

నేతల విగ్రహాలకు ముసుగులు


నక్కవానిపాలెంలో ముసుగులు వేసి ఉన్న విగ్రహాలు

సీతమ్మధార: ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో సిబ్బంది సీతమ్మధార, నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, బాలయ్యశాస్త్రి లేఅవుట్, గురుద్వారా, అల్లూరి సీతారామరాజు జంక్షన్ తదితర ప్రాంతాల్లోని రాజకీయ నాయకుల బ్యానర్లు, ఫొటోలను తొలగించారు. పలు నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించారు. జాతీయ నాయకులు మినహా మిగిలిన అన్నింటికీ ముసుగులు వేశారు.